www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | గురు వారం, 25 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-133 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## బీహార్‌లో రాజకీయ కలకలం

- నితీశ్ బలపరీక్షకు ముందే స్పీకర్ రాజీనామా
- అవిశ్వాస తీర్మానం నోటీసులతో రాజీనామా చేసిన విజయ్ కుమార్ సిన్హా
- ఆర్జెడీ నేతల ఇళ్లపై సిబిఐ దాడులతో సర్వత్రాచర్చ
- దాడులకు భయపడేది లేదన్న మాజీ సిఎం రబ్రీదేవి



**పాట్నా, ఆగస్ట్ 24 (సమ సమాజం):** బీహార్ రాజకీయాలు మరోమారు చర్చగా మారాయి. ఓ వైపు నితీశ్ బలపరీక్ష, అంతకుముందే స్పీకర్ రాజీనామా జరిగిపోయాయి.మరోవైపు సిబిఐ దాడులతో సర్వత్రాచర్చ సాగుతోంది. ఇలా నీతీశ్ కుమార్? సర్కార్? బలపరీక్షకు ముందు బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో అసెంబ్లీ స్పీకర్ పదవికి భాజపాకు చెందిన విజయ్ కుమార్ సిన్హా రాజీనామా చేశారు. ఇటీవల ఏర్పడిన మహాగట్ బంధన్ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కొనే ముందే అసెంబ్లీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హా రాజీనామా చేశారు. అంతకుముందు ఆయన భావోద్వేగంతో ప్రసంగించారు. తనపై ప్రభుత్వం అవిశ్వాస

2వ

# రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై

### ఉన్నతస్థాయి సమీక్షించిన సిఎం కెసిఆర్



**హైదరాబాద్,ఆగస్ట్24(సమసమాజం):** రాష్ట్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రగతిభవన్‌లో ప్రస్తుత పరిణామాలపై సీఎస్, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలపై హైదరాబాద్‌లో రెండో రోజు నిరసనలకు దిగారు. అలాగే బండి సంజయ్ అరెస్ట్ నేపథ్యంలో భాజపా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుత పరిణామాలు, శాంతిభద్రతలపై ముఖ్యమంత్రి ఆరా తీసారు. ఈ సమీక్షలో నగరంలోని మూడ కమిషనరేట్ల సీపీలు కూడా హాజరయ్యారు. ఎమ్మెల్సీ కవితపై లిక్కర్ స్కామ్ ఆరోపణలు రావడంతో గత మూడు రోజులుగా భాజపా కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. మరోవైపు పాతబస్తీలో ప్రశాంత వాతావరణం కొనసాగు తోందని అధికారులు వెల్లడించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా యాక్షన్ ఫోర్స్ బలగాలను దించారు. మీర్‌చౌక్, గోషామహల్, చార్మినార్ జోన్ల పరిధిలో పహారా ఏర్పాటు చేశారు. మూడు ఏసీపీ జోన్ల పరిధిలో 360 మంది ఆర్ఎఎఫ్ జవాన్లతో పహారా కాస్తున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల సీపీలు సీవీ ఆనంద్, స్టీఫెన్ రవీంద్ర, మహేశ్ భగవత్‌లో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## టీ.కాంగ్రెస్‌కు తలనొప్పి ఎంపీ

ప్రియాంకా గాంధీతో వెంకటరెడ్డి భేటీ ● తెరపడని వెంకటరెడ్డి అలక

### హైకమాండ్ ముద్దు... రాష్ట్ర కమాండ్ వద్దు

- మీడియాకు క్లారిటీ ఇవ్వని కోమటిరెడ్డి
- వెంకట్‌రెడ్డి మునుగోడుకు రానట్లే
- పార్టీ పటిష్ఠం కోసం కృషిచేస్తానన్న ఎంపీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ పిలుపు మేరకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ప్రియాంకా గాంధీతో మీటింగ్‌కు హాజరైయ్యారు. మీటింగ్‌లో కొన్ని ఆసక్తికరమైన అంశాలు చర్చకు వచ్చాయని తెలుస్తుంది. మీటింగ్ ముగిసిన అనంతరం మీడీయాతో మాట్లాడుతూ మీటింగ్‌కు సంబంధించి మీరేమి ప్రశ్నలు అడుగొద్దు అని అన్నారు. కాని 45 నిమిషాల మీటింగ్ అర్థవంతంగా జరిగిందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మీటింగ్‌లో దేశంలో జరిగే రాజకీయ పరిణామాలకు సంబంధించి, రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు సంబంధించి, తెలంగాణలో సాధారణ ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చలు జరిపామని అన్నారు. పార్టీ పటిష్టం కోసం కృషిచేస్తామని చెబుతూనే తనలో కొంత అసంతృప్తి ఉన్నట్లుగా వ్యవహరించారు. తెలంగాణలో ప్రస్తుత మునుగోడు ఉపఎన్నికకు సంబంధించి మునుగోడులో పర్యటిస్తారా అన్న విలేకరి ప్రశ్నకు సమాధానం దాటవేశారు. రాబోయే సాధారణ ఎన్నికకు సంబంధించి కృషిచేస్తామని ప్రస్థావించారు. ప్రియాంకా గాంధీతో పది రోజుల తరువాత మరోమారు మీటింగ్‌కు హాజరౌతానని తెలిపారు.

**ప్రియాంకా గాంధీ మీటింగ్ తరువాత కూడా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలో అదే వైఖరి**

మొదటి నుంచి హైకమాండ్‌తో సానుకూలంగా ఉంటూనే, రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీరు హైకమాండ్ ముద్దు.. రాష్ట్ర కమాండ్ వద్దు అన్నట్లు సాగుతుంది. దీనితో ఎం.పీ వెంకట్‌రెడ్డి తీరు చూసి రాష్ట్ర నాయకత్వం విస్తుపోతుంది.

# రాజాసింగ్ ఎమ్మెల్యేగా అర్హుడా?

## దేశ సమగ్రతను కాపాడని ఎమ్మెల్యే రాజాసింగ్ పై సర్వత్రా నిరసనలు

### వివాదాలకు తావివ్వకుండా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలని ప్రజాస్వామికవాదుల సూచన

మతాల పేరుతో పిచ్చి పేలాపనలు చేసే మతోన్మాదులపై ప్రభుత్వాలు కఠిన ఆంక్షలను అమలు చేయాలి. ఈ లౌకిక రాజ్యంలో మతోన్మాద శక్తులను అరికట్టేందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో విభిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో కులం, మతంపేరిట చిచ్చుపెడితే దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగవచ్చు. మానవ జీవన స్థితిగతులలో పెనుమార్పులకు దోహదం కావచ్చు. అందుకే ఎంతటివారైన మతవిద్వేశాలు రెచ్చగొట్టే వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ఇంతటి పరిస్థితులకు కారణమైన రాజాసింగ్ ఒక ఎమ్మెల్యేగా సమాజంలో బాధ్యతగా వ్యవహరించాలి. సకల మతాలను గౌరవించి, భిన్నత్వంలో ఏకత్వంగా మెలగాలి. ఇజం పేరుతో స్వీయనియంత్రణ కోల్పోయి మరోమారు నోరు జారితే కటకటాలకు వెళ్లడం పక్క.

**హైదరాబాద్, ఆగస్ట్ 24 (సమ సమాజం):** ఇటీవల స్టాండప్ కమీడియన్ మునాఫర్ షో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఆ ఈవెంట్ హైదరాబాద్‌లో నిర్వహిస్తే అడ్డుకుంటామని పలుమార్లు హెచ్చరించారు. స్టాండప్ కమీడియన్ మునాఫర్ హాస్యం హిందూ దేవుళ్లను కించపరిచేటట్లు ఉన్నాయని, అలాంటి చర్యలను కండిస్తామని పలుమార్లు రాజాసింగ్ చెప్పుకొచ్చారు. షో విజయవంతంగా ముగిసినా.. రాజాసింగ్ ఊరుకోలేదు. తను ఇతర మతాలను కించపరుస్తూ వీడియో చేసి తన యూట్యూబ్‌లో పోస్టు చేశాడు. దానితో పరిస్థితులు ఆటకెక్కాయి. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా తను మాట్లాడిన మాటలు సంచలనాలకు దారితీశాయి. ఈ పరిణామాలతో ముస్లిం మతస్తులు వివిధ పోలీస్‌స్టేషన్‌లలో కేసులు పెట్టడం, కేసులు నమోదు కావడం బేలుపై బయటకు రావడం అంతా చకా చకా జరిగిపోయాయి. ఇంతటితో ఆగకుండా మరోమారు పార్టు 2 విడుదల చేస్తానని చెప్పడం వివాదస్పదం అవుతుంది. దీనితో ముస్లిం కమ్యూనిటి అంతా తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. ప్రస్తుతం పరిణామాలను చక్కదిద్దేందుకు ప్రభుత్వం పలుచోట్ల ఆంక్షలు విధించింది.

ఇదిలా ఉంటే సంచలన వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్ ఒక ఎమ్మెల్యే హెూదాలో ఉండి మత ఘర్షణలకు పాల్పడితే ఎమ్మెల్యే పదవికి ఎలా అర్హుడు అవుతాడని సామాన్యులు సహితం ఆగ్రహిస్తున్నారు. అశాంతి కారకుడైన రాజాసింగ్ శాంతిని నెలకొల్పేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. గడిచిన నాలుగు ఏండ్లలో గోషామాల్ అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు పడుతుంటే ప్రజాపాలనను పట్టించుకోవడంలో విఫలమైయ్యారని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాణాన్ని విస్మరిస్తున్న రాజాసింగ్**

- రాజాసింగ్ అనే నేను శాసనము ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారత దేశ సార్వభౌమధికారాన్ని, సమగ్రతను కాపాడుతాని గోషామహాల్ ఎమ్మెల్యేగా నా కర్తవ్యాలను శ్రద్ధతో అంతక్కరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం కాని, పక్షపాతంకాని, రాగద్వేషాలుగాని లేకుండా రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికి న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అని చెప్పి ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ ప్రమాణాన్ని ఉల్లంగిస్తే ఎమ్మెల్యే పదవికి రాజాసింగ్ అర్హుడు ఎలా అవుతాడని ప్రజాస్వామిక వాదులు ప్రశ్నిస్తున్నారు.

**హిందూ ధర్మాన్ని కాపాడటానికి ఆత్యాధ్మిక, ధార్మిక సంస్థ నెలకొల్పి ధర్మాన్ని కాపాడండి. మీ సిద్ధాంతాలను అమలు చేసుకోండి కాని ఇతరుల మనోభావాలను దెబ్బతియ్యకండి.**

**గోషామహల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజలు నిన్ను గెలిపించారు. ఆ ప్రాంత ప్రజల భవిష్యత్తు నీ చేతుల్లో పెట్టారు. గడిచిన నాలుగు ఎండ్లల్లో అభివృద్ధి శూన్యం అని ప్రజలు వాపోతున్నారు. ముందు ఎమ్మెల్యేగా మీ బాధ్యతను నిర్వర్తించండి. ప్రజాస్వామ్యాన్ని బ్రతికించండి.**



## రాజాసింగ్‌ను కట్టడి చేయాలి

ఆయనతో సమాజానికి ప్రమాదం

సిఎల్పీ నేత భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 24 (సమసమాజం):** రాజాసింగ్ లాంటి వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమని సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన మాటలు ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని.. సమాజ శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం అతడిని కట్టడి చేయాలన్నారు. చట్ట సభల్లో ఉన్న వ్యక్తిలా రాజాసింగ్ మాట్లాడడం లేదని.. అవసరమైతే ఆయన్ని సమాజం నుంచి బహిష్కరించాలని సూచించారు. రాజాసింగ్‌కు ఇది కొత్త కాదని.. గతంలో ఇలా చాలా సార్లు వివాదాస్పద వాఖ్యలు చేశారని చెప్పారు. దళితుల అహారపు అలవాట్లపై కామెంట్స్ చేసి వారిని అవమానించారన్నారు.బీజేపీ విధానాలు లౌకికవాదాని పెను ప్రమాదంగా మారాయని.. మిడతల దండు దాడి లాగ బీజేపీ నాయకత్వం సమాజంపై దాడి చేస్తుందని భట్టి

2వ

## రాజాసింగ్‌ను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయండి

స్పీకర్‌కు మజ్లిస్ ఎమ్మెల్యే లేఖ

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై శాసనసభాపతికి మజ్లిస్ ఫిర్యాదు చేసింది. విద్వేష వ్యాఖ్యలు చేసిన రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది. రాజాసింగ్‌ను శాసనసభ నుంచి బహిష్కరించాలని సభాపతికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డికి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రీ లేఖ రాశారు. పదే పదే తన చర్యలతో.. రాజాసింగ్ శాసనసభ్యునిగా అర్హత కోల్పోతున్నారని సభ వెలుపల, లోపల ఆయన వైఖరి కారణంగా అసెంబ్లీ గౌరవానికి భంగం కలుగుతోందని పేర్కొన్నారు. రాజాసింగ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు శాసనసభ్యునిగా చేసిన ప్రమాణాన్ని ఉల్లంఘిస్తున్నాయని రాజ్యాంగ మౌలికసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యేగా రాజాసింగ్ అనర్హుడనేందుకు ఆయన వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన ఫిర్యాదులు, పత్రికా కథనాలను లేఖతో జతపర్చడంతో పాటు రాజాసింగ్ తన ప్రవర్తనతో ఇటీవలి అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ అయినట్లు గుర్తుచేశారు.తన ప్రవర్తన వల్ల ఎమ్మెల్యేగా అర్హత కోల్పోవడంతో పాటు ప్రమాణ స్వీకారానికి విరుద్ధంగా ఉన్నందున రాజ్యాంగంలోని 194వ ఆర్టికల్ ప్రకారం సభా గౌరవ ఉల్లంఘన ధిక్కారం కింద రాజాసింగ్‌పై చర్యలు తీసుకునే అధికారం శాసనసభకు ఉందని సభ నుంచి బహిష్కరించే అధికారాలు ఉన్నాయని లేఖలో మజ్లిస్ పేర్కొంది. వాటన్నింటిని పరిగణలోకి తీసుకొని రాజాసింగ్‌పై బహిష్కరణ ప్రక్రియను ప్రారంభించాలని శాసనసభాపతిని మజ్లిస్ విజ్ఞప్తి చేసింది.

# సంపాదకీయం

## కాలం చెల్లిన లెఫ్ట్ విధానాలు!

దేశంలో కాంగ్రెస్‌కు అంతో ఇంతో ప్రజాదరణ ఉన్నా..కమ్యూనిస్టులకు ఆ మాత్రం ఆదరణ కూడా లేదు. పిడివాదం, పడికట్టు పదాలతో వారు చేస్తున్న పోరాటాలు ప్రజలను మెప్పించలేక పోతున్నాయి. అలాగే మునుపటిలా పోరాటాలు చేయడం లేదు. సమస్యలపై ఉద్యమించడం లేదు. ఉన్న ఒకరిద్దరు నేతలు తమ ఉనికిని చాటుకునే యత్నాల్లో ఉన్నారు. ఎప్పటికి ఏది అవసరమో అది చేద్దాం అన్న ధోరణిలో ఉన్నారు. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో మమతా బెనర్జీ ప్రతిపాదించిన యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇచ్చారే తప్ప గిరిజన మహిళ అయిన ద్రౌది ముర్ముకు మద్దతు ఇవ్వలేదు. ఇంతకన్నా దిగజారుడు ఉండబోదు. కేవలం బిజెపిని వ్యతిరేకించాలన్న కక్షతో ద్రౌపది ముర్మును వ్యతిరేకించారు. తమ బద్ద శతృవైన మమతా బెనర్జీతో చేతులు కలిపారు. ఆమె చెప్పినట్లు తలూపారు. ఇదీ నేటి కమ్యూనిస్టుల సిద్దాంతం. ఇకపోతే తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే గట్టిగా సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలను కదిలించలేక పోతున్నారు. మునుగోడు ఉప ఎన్నికలో కూడా టిఆర్‌ఎస్ పిలుపు ఆలస్యం పోయి చంకనెక్కారు. మతోన్మాద శక్తులను ఓడించాలని నిర్ణయించి మద్దతు ఇచ్చామని సిపిఐ, సిపిఎంలు ప్రకటించుకున్నాయి. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. పోటీ చేయడమో లేకపోతే గమ్మున ఉండడమో చేయకుండా గడీల పాలన అంటూ విమర్శించిన కెసిఆర్‌కు మద్దతు ప్రకటించడం వెనక మతలబు లేదని అనుకోలేం. ఏం ఆశించి ఈ నిర్ణయం తీసుకున్నారో ప్రజలు కూడా లెక్కలు వేసుకుంటున్నారు. మునుగోడు నియోజకవర్గంలో రానున్న ఉప ఎన్నికలు సామాన్య ప్రజలకు, పెట్టుబడిదారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని పేర్కొనడం ద్వారా తమ దిగజారుడు తనాన్ని చాటుకున్నారు. ఈ ఎన్నికలో బీజేపీ మతోన్మాద శక్తులను ఓడించాలని కార్యకర్తలకు, ప్రజలకు పిలుపు నిచ్చారు. దేశంలో మోదీ ప్రభుత్వం నిరుపేదలపై పెనుభారం మోపుతుందని, నిత్యావసర సరుకులు మొదలుకొని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వరకు విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని వాదిస్తున్నారు. పోనీ మోడీకి వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేశారా అంటే అదీ లేదు. రానున్న ఉప ఎన్నికల్లో బీజేపీని ఓడించి మోదీ ప్రభుత్వానికి తగి న బుద్ధి చెప్పాలని అంటున్న వారు.. మునుగోడుతో ఇది సాధ్యమా అన్నది ఆలోచించడం లేదు. అలాగే కెసిఆర్ గడీల పాలన అన్న వారు ఆయనతో ఎందుకు జత కట్టారో చెప్పడం లేదు. ఇకపోతే ఇప్పటికే సిపిఐ మనుగోడులో టిఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వగా, సీపీఎం మునుగోడు ఉపఎన్నికలో ఏ పార్టీతో పొత్తుకు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. స్వాతంత్ర్య పోరాట చరిత్ర, తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తుందని ఆరోపించినంత మాత్రాన ప్రజలు నిజాలు తెలుసుకోలేకుండా ఉండరు. నిజానికి దేశ చరిత్రను వక్రీకరించిన వారిలో కమ్యూనిస్టులు ముందుంటారు. ఇలా సిద్దాంతం లేకుండా వారి రాజకీయ గమ్యం సాగుతోంది. అందుకే వామపక్షాల ఐక్యత అన్నది నినాదంగా మారుతోంది. ఏళ్లుగా ఈ విషయంలో తర్జనభర్జనలే తప్ప కార్యాచరణ లేకుండా పోతోంది. కలసి పోరాడాలన్న ఆకాంక్ష ఉన్నా ముందరి కాళ్లకు బంధం పడుతోంది. ఇతర పార్టీలతో పొత్తులకు వెంపర్లాడుతున్న లెఫ్ట్ నేతలు సంస్థాగతంగా బలహీనం అవుతున్నాయి. మారుతు న్న కాలానుగుణంగా సిద్ధాంతాలను మార్చుకోకపోవడం కూడా ఒక కారణంగా చూడాలి. వీరు ఎంతసేపూ మరో పార్టీకి తోకపార్టీగా మారడం మినహా గట్టిగా చేస్తున్న ప్రయత్నాలు శూన్యం. అందుకేనేమో గతంలో కమ్యూనిస్టులకు ఉన్న ప్రజాదరణ కాలక్రమేణా కనుమరుగు అవుతోంది. అయినా ఆ పార్టీల్లో ఆత్మవిమర్శ అన్నది మచ్చుకైనా కానరావడం లేదు. పోరాటాల్లో ఆరితేరిన లెఫ్ట్ పార్టీలు ఎందుకనో ప్రజల్లో స్థానం సంపాదించుకోలేక పోతున్నారు. లెఫ్ట్ బలహీనం కారణంగా ఇతర రాజకీయ పార్టీలు తమ స్థానాలను పదిలం చేసుకోవడంతో పాటు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం అవసరం. అందుకు లెఫ్ట్ పార్టీలు విభేదాలు పక్కకు పెట్టి కనీసం కూటమిగా అయినా ముందుకు సాగాలి. విలీనం కావాలన్న ఆశ ఎలాగూ నెరవేరనప్పుడు కూటమిగా ముందుకు సాగాలన్న గట్టి నిర్ణయం కూడా తీసుకోవ డం లేదు. ప్రస్తుతం దేశం క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటోందనీ.. ఈ దశలో వామపక్షాల ఐక్యత అత్యవ సరమని పలు వామపక్ష పార్టీల నేతలు అభిప్రాయపడ్డారు. భాజపా వ్యతిరేక గళాలు ఒకే తాటి మీదికి రావాలన్న ఆకాంక్ష బలంగా వినిపిస్తున్నా..అందుకు లెఫ్ పార్టీలు ఆవగింజంతయినా పనిచేయడం లేదు. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులు, మేధావులు, సిద్ధాంతకర్తలు, మైనారిటీలు, దళితులందరూ ఒకే వేదిక మీదకు రావడంపై తక్షణం దృష్టిపెట్టాలని భారీ మాటలు చెబుతారు. ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో కేంద్రం కీలుబొమ్మగా మారిందనీ.. మోదీ సర్కారు నిపనిచేయలేక పోతున్నారు. అయితే మతోన్మాదం విషయంలో లెఫ్ట్ రెండు నాల్కల ధోరణితో ఉంది. హిందువులు ఏదైనా చేస్తే దానిని తీవ్రంగా పరిగణించి హిందూ మతోన్మాదం అన్న ముద్ర వేస్తున్నారు. ఈ జాడ్యం నుంచి వారు బయటపడక పోవడంతో హిందువుల్లో లెఫ్ట్ పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకత ఏర్పడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ టెర్రరిజం విషయంలో కఠినంగా లెఫ్ట్ ఉండలేక పోతోంది. మతోన్మాద రాజకీయాలను భాజపా సర్కారు ప్రోత్సహిస్తోందని.. చెబుతూ హిందువులను మాత్రం ఎవరేమన్నా నోర్మూసుకుని ఉండాలన్న ధోరణిని ప్రదర్శిస్తోంది. కాశ్మీర్‌లో మత ఆందోళనలను. పాక్ ఉగ్రవాదుల దుశ్చర్యలను,. ఐఎస్ ఉగ్రవాదుల ఊచకోతలను తీవ్రంగా వ్యతిరేకించి ప్రజలకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. ఇక లెఫ్ట్ ఐక్యత లేదా విలీనం విషయంలో సిపిఐ ఎప్పుడూ ఉదారంగా మాట్లాడుతుంటుంది. సత్వర రాజకీయ అవసరాలపైనా చర్చించి ప్రజల్లో నమ్మకం కలిగేలా చేస్తే తప్ప లెఫ్ట్‌కు అవకాశాలు లేవనే చెప్పాలి. ఈ క్రమంలో తమ ఆలోచనలకు దగ్గరగా ఉన్న లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించాలి. వామపక్ష ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి. రానున్న రోజుల్లో దేశ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేలా లెఫ్ట్ పార్టీలు ముందుకు రావాలి. కేవలం బిజెపి హిందుత్వాన్ని ప్రోత్సహింస్తోందని చెప్పడం ద్వారా మైనార్టీ ఓట్ల కోసం వెంపర్లాడే రాజకీయాలు మానాలి. సమస్యలను అజెండగా చేసుకుని పోరాడితే తప్ప ప్రజలు నమ్మరని గుర్తించాలి. ఐక్యతా నినాదాన్ని పక్కన పెట్టి కలసి పనిచేయాలన్న సంకల్పంతో ముందుకు సాగితే తప్ప ప్రజలు నమ్మరు. సమస్యపై పోరాటం ప్రాతిపదికగా కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# బీహార్‌లో రాజకీయ కలకలం

(మొదటి పేజీ తరువాయి..)తీర్మానం ప్రవేశపెట్టడంపై ఆవేదన చెందారు. తనపై వచ్చిన ఆరోపణలేవీ ఆమోదయోగ్యం కాదని అన్నారు. భాజపాకు చెందిన ఆయన విధాన సభను 2 గంటలకు వాయిదా వేసి గందరగోళం నడుమ బయటకు వెళ్లారు. బలపరీక్షకు నేతృత్వం వహించాల్సిందిగా జేడీయూకు చెందిన నరేంద్ర నారాయణ్ యాదవ్ పేరును సిన్హా సూచించారు. అంతకుముందు సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలు ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసు అస్పష్టంగా ఉందని, నియమ నిబంధనలు పాటించలేదని తెలిపారు. 'స్పీకర్‌ను అనుమానించి మీరు ఎలాంటి సందేశం పంపుదామని చూస్తున్నారని, ప్రజలే నిర్ణయం తీసుకొంటారని వ్యాఖ్యానించారు. చివరకు రాజీనామా చేసిన అనంతరం హడావుడిగా తీవ్ర భావోద్వేగంతో సభను వీడి బయటకు వెళ్లారు. అదే సమయంలో భాజపాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు కాషాయ కండువాలు ధరించి 'భారత్ మాతాకీ జై', 'జై శ్రీరామ్' నినాదాలు చేశారు. అంతకుముందు భాజపా ఎమ్మెల్యేలు విధాన సభ ముందు నిరసనలు చేశారు. రోవైపు మహా గట్‌బంధన్ సర్కారు బలపరీక్ష రోజే పలువురు ఆర్జేడీ నేతల ఇళ్లపై సీబీఐ దాడులు నిర్వహించింది. పట్నాలోని ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ సహా పలువురి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టింది. ఆర్‌జేడీ, కాంగ్రెస్ సహా పలు పార్టీలతో కలిసి జేడీయూకు చెందిన నీతీశ్ కుమార్ నేతృత్వంలోని మహాగట్ బంధన్ ప్రభుత్వం ఈ నెల 10న కొలువుదీరింది. దాదాపు రెండు వారాలు గడుస్తున్నా.. భాజపాకు చెందిన అసెంబ్లీ స్పీకర్ సిన్హా రాజీనామా చేయలేదు. సాధారణంగా ప్రభుత్వం మారితే అంతకుముందు ఎన్నికైన స్పీకర్ రాజీనామా చేస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం.. అసెంబ్లీ సెక్రటేరియట్ రెండు రోజుల సెషన్ షెడ్యూల్‌లో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ సూచనల మేరకు మార్పులు చేసింది. పదవిని వీడేందుకు నిరాకరిస్తున్న సిన్హాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ఈ మార్పులు జరిగాయి. దీంతో సిన్హా బుధవారం రాజీనామా చేయక తప్పలేదు. ఈ క్రమంలో మరో పరిణామం చోటుచేసుకుంది. సర్కారు బలపరీక్ష రోజే పలువురు ఆర్జేడీ నేతల ఇళ్లపై సీబీఐ దాడులు నిర్వహించింది. పట్నాలోని ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ సహా పలువురి ఇళ్లల్లో తనిఖీలు చేపట్టింది. ఐటీ, ఈడీ, సీబీఐ ఈ మూడు భాజపా కిందే పనిచేస్తాయని, వారి ఆఫీసులను కూడా ఆ పార్టీ స్క్రిప్టే నడిపిస్తుందని ఆర్జేడీ నాయకులు మండిపడ్డారు. అయితే సీఎం నీతీశ్ కుమార్ ఫిర్యాదు మేరకే సీబీఐ తనిఖీలు నిర్వహిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ జైస్వాల్ అన్నారు. బలపరీక్ష రోజు.. ఆర్జేడీ నేతల ఇళ్లపై సీబీఐ దాడులు జరగడం సంచలనం సృష్టిస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ బుధవారం పట్నాలోని ఆర్జేడీ ఎమ్మెల్సీ సునీల్ సింగ్ ఇంట్లో తనిఖీలు చేపట్టింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో లాలూప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్న రోజుల్లో జరిగిన 'ల్యాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణం దర్యాప్తులో భాగంగా ఈ తనిఖీలు జరుగుతున్నాయి. ఈ తనిఖీలపై సింగ్ స్పందిస్తూ..'ఇప్పటికే ఒక సారి తనిఖీలు చేశారు. మళ్లీ చేయడంలో అర్థం లేదు. భయభ్రాంతులను సృష్టించి ఎమ్మెల్యేలను వారికి అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇదే కుంభకోణానికి సంబంధించి ఆర్జేడీకి చెందిన మరో నేత, ఎంపీ అష్ఫాక్ కరీం ఇంటిపై కూడా సీబీఐ నేడు దాడులు నిర్వహించింది. ఈ దాడులపై ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా స్పందిస్తూ 'ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు.. భాజపా దాడులు అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అవి భాజపా కిందే పనిచేస్తాయి. వారి ఆఫీసులను కూడా ఆ పార్టీ స్క్రిప్టే నడిపిస్తుంది. నేడు బిహార్ అసెంబ్లీలో బల పరీక్ష ఉంది.. అదే సమయంలో ఇక్కడేం జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు' అని పేర్కొన్నారు. 2004-09 మధ్య లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రిగా పని చేశారు. రైల్వే ఉద్యోగాల భర్తీ కోసం 2009లో జరిగిన రిక్రూట్‌మెంట్లలో పలువురు అభ్యర్థులకు గ్రూప్-డి ఉద్యోగాలు ఇచ్చేందుకు వారి నుంచి లాలూ భూములను లంచంగా తీసుకున్నారని అభియోగాలు ఉన్నాయి. ఇందులో లాలూ ప్రసాద్ యాదవ్ భార్య, మాజీ సీఎం రబ్రీ దేవి, కుమార్తె మిసా భారతీతో పాటు ఉద్యోగాలు పొందిన పలువురిని సీబీఐ నిందితులుగా చేర్చింది. అయితే ఈ దాడులకు వెరవబోమని మాజీ సిఎం రబ్రీదేవి అన్నారు. కేంద్రం కుట్రమేరకు దాడులు జరుగుతున్నాయని అన్నారు.

# రాజాసింగ్ లాయర్ కరుణాసాగర్‌కు బెదింపు కాల్స్

**చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్**

**హైదరాబాద్, ఆగస్ట్ 24 (సమసమాజం):** బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తరపున వాదించినందుకు తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని లాయర్ కరుణ సాగర్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు తనకు ఫోన్ చేసి చంపుతామంటూ బెదిరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు దుబాయి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అంతు చూస్తామని అంటున్నారని తెలిపారు. ఒక న్యాయవాదిగా తన వృత్తి ధర్మాన్ని నెరవేర్చానే తప్ప ఎవరికి వ్యతిరేకంగా పనిచేయలేదని స్పష్టం చేశారు. రాజాసింగ్ అరెస్ట్ సమయంలో పోలీసులు చట్టపరంగా వ్యవహరించలేదని, అందువల్లే రిమాండ్ రిజక్టయ్యిందన్నారు. 41 సీఆర్‌పీసీ నిబంధనలు పాటించనందువల్లే రాజాసింగ్ కు బెయిల్ వచ్చిందని లాయర్ తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్న ఆయన... బెదిరింపులకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. ముస్లింలను కించపరిచేలా ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ వీడియోను విడుదల చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఆందోళన చెలరేగింది. పలు చోట్ల ఆయనకు వ్యతిరేకంగా కేసులు నమోదు అయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచింది. అయితే అరెస్ట్ సమయంలో 41 సీఆర్‌పీసీ, సుప్రీంకోర్ట్ నియమాలు పాటించలేదన్న కోర్టు... రాజాసింగ్ కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. రాజాసింగ్ తరపున కరుణ సాగర్ కోర్టులో వాదించారు.

# రాజాసింగ్‌ను కట్టడి చేయాలి

(మొదటి పేజీ తరువాయి..) ఆరోపించారు. కొంతమంది నాయకులు వారి అవసరాల కోసం ప్రజలను రెచ్చగొడుతూ.. రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదని.. భారత రాజ్యాంగం విలువలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ మతం గురించి ఎవరు కించపరిచేలా మాట్లాడినా.. సభ్య సమాజం ఖండించాలన్నారు. ఇదిలావుంటే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవితతో పాటు ప్రముఖులున్నట్లు వార్తలు వస్తున్నాయని జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి అన్నారు. పదవిలో ఉన్నవారు నిజాయితీని నిరూపించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణలో అవినీతి జరుగుతుందంటున్న బీజేపీ దర్యాప్తు సంస్థలతో విచారణ ఎందుకు జరిపించడం లేదు? అని కోదండరెడ్డి ప్రశ్నించారు. టీఆర్ఎస్, బీజేపీ మధ్య లాలూచీ ఉంది కాబట్టే జాప్యం జరుగుతోందన్నారు.

# లోక కళ్యాణం కోసం పాదయాత్ర

**కెసిఆర్ అభివృద్ధి పథకాలకు దేవుడి ఆశిస్సులు ఉండాలి ● దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**



**నిర్మల్, ఆగస్ట్ 24 (సమసమాజం):** గండి రామన్న దత్తసాయి క్షేత్రం నుంచి కదిలి పాపహరేశ్వర్ దేవాలయం వరకు బుధవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారు. మొదట దత్తసాయిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల బృందంతో పాపహరేశ్వర్‌కు పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లోక కల్యాణం కోసం గత ఆరేళ్లుగా ప్రతి శ్రావణ మాసం చివరలో సాయిదీక్షా సేవా సమితి అధ్యక్షుడు లక్కిడి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ మహత్కార్యంలో పాలుపంచుకోవడం భగవత్ కృపగా భావిస్తున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ సారథ్యంలో పెద్ద ఎత్తున ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని, నిర్మల్ నియోజకవర్గం కూడా ఆధ్యాతికంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూకీ పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కే విజయలక్ష్మిరెడ్డి, సాయిదీక్షా సేవాసమితి అధ్యక్షుడు లక్కిడి జగన్మోహన్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ ఈశ్వర్, నిర్మల్ పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షుడు మారుగొండ రాము, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్ పాల్గొన్నారు.



# తెలంగాణలో బిజెపి వికృత రాజకీయాలు

- కేంద్రం కనుసన్నల్లో వరుస పరిణామాలు
- బండి సంజయ్,రాజాసింగ్ వ్యవహారాలే నిదర్శనం
- ఇక్కడ అలజడులు సృష్టించేందుకే పన్నాగం
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మండిపాటు




**సూర్యాపేట, ఆగస్ట్ 24 (సమసమాజం):** తెలంగాణలో బీజేపీ తనవికృతరూపాన్ని ప్రదర్శిస్తోందని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ జాతీయ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే రాష్ట్రంలో అలజడులు జరుగుతున్నాయని మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. వైషమ్యాలు రెచ్చగొట్టి కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఎన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ లక్ష్యాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నూతన్‌కల్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘర్షణ వాతావరణం, రాజాసింగ్ వ్యవహారం, బండి సంజయ్ దీక్షలు, మద్యం కుంభకోణం ఆరోపణలపై స్పందించారు. తెలంగాణాలో శాంతిభద్రతల సమతుల్యం దెబ్బతీసి సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునే కుట్ర జరుగుతోందన్నారు. చట్టబద్ధ సంస్థలు ఎలాంటి ఆరోపణలు చేయకున్నా బీజేపీ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కావాలని రెచ్చగొట్టి ప్రతిదాడులు చేసేలా రెచ్చగొట్టి.. శాంతిభద్రతలకు భంగం కలిగించాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ జాతీయ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే రాష్ట్రంలో అలజడులు జరుగుతున్నాయన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి.. కులాల మధ్య బీజేపీ కుట్రలు చేస్తున్నద న్నారు. ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ లక్ష్యాన్ని అడ్డుకోలేరని స్పష్టంచేశారు. రాజా సింగ్ సస్పెన్షన్ ఒక డ్రామా అని, పథకం ప్రకారం మాట్లాడించి సస్పెన్షన్ చేసినట్లు నటిస్తున్నారన్నారు. బీజేపీ కుట్రలపై ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దాడులే లక్ష్యంగా చేసుకుంటే టీఆర్ఎస్ ఎదుట బీజేపీ నిలువలేదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్ష, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు, సస్పెన్షన్‌పై స్పందించారు. బీజేపీ నేతలు అబద్దాలు ప్రచారం చేసి దాడులు చేస్తున్నారని వెల్లడించారు. కావాలనే రెచ్చగొట్టి, ప్రతిదాడులు చేయించుకుని శాంతిభద్రతలకు భంగం కలిగించాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ కుట్రల పట్ల ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దాడులే లక్ష్యంగా చేసుకుంటే టీఆర్ఎస్ ముందు బీజేపీ ఎంతన్నారు.

# మునుగోడులో టిఆర్ఎస్ గడియారాల పంపిణీ

**నల్లగొండ, ఆగస్ట్ 24 (సమసమాజం):** మునుగోడు ఉపఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్నీ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. ఇంకా నోటిఫికేషన్ రానప్పటికీ ఇప్పటీకే అక్కడ భారీ బహిరంగ సభలను నిర్వహించి హోరెత్తించాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు అధికార టీఆర్ఎస్ పార్టీ ఓటర్లకు తాయిలాలు ప్రారంభించింది. చౌటుప్పల్ మండలం, సంస్థన్ నారాయణపురం మండలంలో టీఆర్ఎస్ నాయకులు సీఎం కేసీఆర్, కారు బొమ్మతో ఉన్న గడియారాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీలో ఇప్పటికే సుమారు 8, 000 గడియారాలను అన్ని వార్డులలో పంపిణీ చేశారు. మండల కేంద్రంలో వివిధ గ్రామాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇప్పటినుంచే గడియారాలను పంపిణీ చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

# ఎఐఎంతో కలసి బిజెపి నేతలపై దాడులు

**కల్వకుంట్ల కుటుంబమే శాంతిభద్రతలకు సమస్య**
**ఎక్కడ అవినీతి ఉన్నా అందులో వారి వాటా ఉంటోంది**
**ప్రజా సంగ్రామయాత్ర కొనసాగిస్తామని బండి వెల్లడి**




**కరీంనగర్, ఆగస్ట్ 24 (సమసమాజం):** తెలంగాణలో కావాలనే అలజడులు సృష్టించాలని, నెపాన్ని బిజెపిపైకి నెట్టాలన్న కుట్రలో సిఎం కెసిఆర్ ఉన్నాడని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబమే రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రధాన సమస్యగా మారిందని అన్నారు. ఎంఐఎంతో కలిసి హైదరాబాద్‌లో అల్లర్లు చేయించడానికి సీఎం కేసీఆర్ సిద్ధమయ్యాడని అన్నారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఈ ప్లాన్ జరుగుతోంది. ఎంఐఎం గూండాలను కట్టడి చేసే పనిని టీఆర్ఎస్ సర్కారు చేయట్లేదు. బీజేపీ నాయకులపై దాడి చేయమని ఎంఐఎం గూండాలను రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ సర్కారు ఎన్ని దుష్ట ప్రయత్నాలు చేసినా ప్రజాసంగ్రామ యాత్రను ఆపేది లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు.



బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నిర్వహించిన నిరసన దీక్ష ముగిసిన సందర్భంగా కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాళ్లతో వచ్చినా.. రాడ్లతో ఎదురొచ్చినా ప్రజా సంగ్రామ యాత్రను ఆపబోమన్నారు. కల్వకుంట్ల కుటుంబ సభ్యుల గడీలను బద్దలు కొట్టేదాకా యాత్ర కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ప్రజాసంగ్రామ యాత్ర ముగింపు సభ ఈనెల 27న మధ్యాహ్నం 2 గంటలకు హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ లో జరుగుతుందని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు బండి సంజయ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఆటంకాలు సృష్టించే ప్రయత్నం చేసినా.. ముగింపు సభను విజయవంతం చేసి తీరుతామన్నారు. టీఆర్ఎస్ సర్కారు నిర్బంధాలకు నిరసనగా ఇవాళ ఉదయం 11 నుంచి 1 గంటల వరకు నిర్వహించిన దీక్షను విజయవంతం చేసినందుకు పార్టీ శ్రేణులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆలంపూర్, దేవరుప్పులలో ప్రజలు తిరగబడ్డా టీఆర్ఎస్ సర్కారులో మార్పు రాలేదని.. ఇక సర్కారును మార్చడమే మేలని చెప్పారు. హైదరాబాద్ లో ఎక్కడ ఐటీ దాడులు చేసినా టీఆర్ఎస్ లీడర్ల పేర్లే బయటికొస్తున్నయ్. దీన్ని బట్టి వాళ్ల అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాళ్లు చేయని దందా అంటూ ఏదీ లేదు. ఇసుక దందా.. లిక్కర్ దందా.. డ్రగ్స్ దందా.. ల్యాండ్ దందా, పత్తాల దందాలలో ప్రతీచోటా టీఆర్ఎస్ లీడర్ల జాడ కనిపిస్తోంది. ఇంకా ఏమైనా దందాలున్నా వాటిలో వాళ్ల పేర్లే బయటపడతయ్ అని బండి సంజయ్ ఆరోపించారు. అడ్డగోలుగా కేసీఆర్ కుటుంబం సంపాదిస్తున్న సంపాదన గురించే తాము ప్రశ్నిస్తున్నమని తెలిపారు. కుటుంబ పాలన ఎంత ప్రమాదకరమో.. డైనింగ్ టేబుల్ నిర్ణయాల వల్ల ఎలాంటి ఇబ్బంది కలుగుతుందో ఇప్పుడు ప్రజలకు తెలిసి వస్తోందని ఆయన కామెంట్ చేశారు.

# మునుగోడులో గెలిచేది టిఆర్ఎస్సే

**మంత్రి మల్లా రెడ్డి భరోసా**

మేడ్చెల్,అగస్టు24(ఆర్ఎన్ఎ):మునుగోడులో గెలిచేది టీఆర్ఎస్ పార్టీనే అని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా కీసర మండల కేంద్రంలోని కీసర, నాగారం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 109 కల్యాణ లక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు అందజేసిన మంత్రి మాల్లారెడ్డి.. బీజేపీపై పలు కామెంట్లు చేశారు. రాష్ట్రంలో బీజేపీ మత కల్లోలాలు సృష్టించే విధంగా ప్రజలను రెచ్చగొడుతోందని చెప్పారు. బీజేపీ ఎన్ని చేసినా రాష్ట్రంలో వచ్చేది టీఆర్ఎస్ పార్టేనని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆ పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు మాత్రమే ఉంటారని, ఇంకా ఆ పార్టీ వారు గెలిచే ప్రసక్తి లేదని చెప్పుకొచ్చారు. కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి సీఎం కేసీఆర్ పై ప్రశంసలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ఆడపడుచులకు ఓ అన్నలా అండగా ఉండి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేసే ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్ దేనన్నారు. పేద ప్రజల కోసం చాలా మంచి సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఒక్కే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అన్న మంత్రి.... డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు త్వరలోనే లబ్దిదారులకు అందేలా చూస్తామని స్పష్టం చేశారు.



# సామాజిక సంస్థల ద్వారా వైద్య సేవలు భేష్

### మాతా అమృతానందమయి హాస్పిటల్ ప్రారంభంలో మోడీ





**చండీఘడ్, ఆగస్ట్ 24 (సమసమాజం):** ఆధ్యాత్మిక, సామాజిక సంస్థల ద్వారా వైద్య సేవలు అందించడమనేది.... పబ్లిక్ ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ మోడల్ కు ఉదాహరణ అని ప్రధాని మోడీ అన్నారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో అమృత హాస్పిటల్‌ను ప్రధాని మోడీ ప్రారంభించారు. కార్యక్రమంలో హర్యానా సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌటాలా పాల్గొన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయలతో 6 వేల కోట్లతో మాతా అమృతానందమయి మఠం ఆధ్వర్యంలో హాస్పిటల్ నిర్మించారు. ఈ మోడల్ ద్వారా అట్టడుగు వర్గాల వారికి కూడా సేవలు అందించవచ్చారు. దేశంలో ప్రస్తుతం విద్య, వైద్య వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు ప్రధాని మోడీ. పెద్ద రోగం వస్తే ట్రీట్ మెంట్ కోసం పేషెంట్స్ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవాల్సి వస్తుండేదని.. ఇప్పుడు ఆ అవసరంలేదని ప్రధాని మోడీ తెలిపారు. ఈ హాస్పిటల్‌కు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పేషెంట్లు వచ్చి చికిత్స పొందవచ్చు అని చెప్పారు.

# టీఆర్ఎస్‌ను బొందపెట్టే పార్టీ బిజెపి

### మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**నల్గొండ, ఆగస్ట్ 24 (సమసమాజం):** టీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టే పార్టీ బీజేపీ మాత్రమే అని మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం చండూర్ మండల కేంద్రలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 12 మంది ఎమ్మెల్యేలను లాక్కొని కేసీఆర్ కాంగ్రెస్ పార్టీని బొందపెట్టారన్నారు. కానీ కేసీఆర్, టీఆర్ఎస్ ను బొంద పెట్టేందుకు బీజేపీ వచ్చిందని హెచ్చరించారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక కొంతమంది పోస్టర్లు అతికించి సోషల్ మీడియలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆత్మగౌరవం ఉన్న వ్యక్తిగా ప్రజల కోసమే తాను పార్టీ మారినట్లు స్పష్టం చేశారు. చచ్చేంత వరకు మునుగోడు ప్రజాలతోనే ఉంటానని, వేరే ఏ నియోజకవర్గంలో పోటీ చేయనని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండి మూడేండ్లు ఏం చేయలేకపోయానని రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న తనకు నిధులు ఇవ్వకుండా కేసీఆర్ ప్రభుత్వం



ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే తాను బీజేపీలోకి వెళ్లానన్న ఆయన... మోడీ, అమిత్ షా నాయకత్వంలో మునుగోడును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే మునుగోడు ఉప ఎన్నిక కేసీఆర్ ను గద్దె దించే యుద్ధమన్న రాజగోపాల్ రెడ్డి... కేసీఆర్ కుటుంబ పాలన పోవాలంటే మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ ను చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువులు వివిధ పార్టీల నుంచి బిజెపిలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి స్వాగతించారు.

# పెట్రో ధరలు వెంటనే తగ్గించాలి

**అంతర్జాతీయంగా తగ్గుతున్న ముడి చమురు**
**బిజెపి విధానాలతో ప్రజలకు కష్టాలు**
**ధరలు తగ్గించాలంటూ కెటిఆర్ డిమాండ్**



హైదరాబాద్,అగస్టు24(ఆర్ఎన్ఎ): అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రజలపై పెట్రో భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. తగ్గిన ముడిచమురు ధరల మేరకు పెట్రో రేట్లు తగ్గించాలని మోదీని డిమాండ్ చేశారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పెట్రోల్ ధరలు అమాంతం పెరిగిపోయాయని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, తగ్గినా దేశంలో మాత్రం పెట్రో దోపిడీ ఆగడం లేదన్నారు. ప్రస్తుతం ముడి చమురు బ్యారల్ ధర 95 డాలర్లకు తగ్గినా, పెట్రో రేట్లను తగ్గించడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారమే దేశ ప్రజల నుంచి రూ. 26 లక్షల కోట్లకు పైగా కేంద్రం వసూలు చేసిందని కేటీఆర్ తెలిపారు. ఈ పెట్రో పన్నులను ప్రజల నుంచి గుంజి, కార్పోరేట్ల రుణాల మాఫీకి వాడుకుంటున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. చట్టాన్ని మార్చుకుని మరీ సెస్సులు, సుంకాల పేరుతో భారీగా దోపిడీ చేస్తున్నదన్ని ÷ర్ అయ్యారు. ఆ నెపాన్ని రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటిదాకా పెట్రోల్ పైన ఒక్క రూపాయి అదనపు పన్ను వేయని తెలంగాణ లాంటి రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెడుతున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన కొండంత ధరలను నామ మాత్రంగా తగ్గించి, పేదల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని, ఇది ముమ్మమాటికీ నయవంచనకు పరాకాష్టనే అని కేటీఆర్ అన్నారు. దేశంలో ఏర్పడిన దుర్భర ద్రవ్యోల్బణ పరిస్థితులు, కరోనా సంక్షోభ నేపథ్యంలో పెట్రో ధరలను వెంటనే తగ్గించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తన అసమర్థ విధానాలు, పరిపాలనతో దేశ ప్రజలను దోపిడీ చేస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇప్పటికైనా పెట్రో పన్నుభారం నుంచి భారత దేశ ప్రజలకు కాస్తయినా విముక్తి కలిగించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రపంచ మార్కెట్లో ముడి చమురు ధరలు వంద డాలర్లకు కన్నా దిగువకు భారీగా తగ్గుతున్నా, ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వం ఆమేరకు పెట్రో భారాన్ని ప్రజలపై తగ్గించేందుకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. మోదీ నాయకత్వంలోని కేంద్రం, పెట్రో ధరల పెరుగుదలకు అంతర్జాతీయ ముడిచమురు ధరలు కారణమంటూ చేస్తున్న వాదనలో డొల్లతనం ఇప్పుడు మరోసారి బయటపడుతున్నదన్నారు కేటీఆర్. మోదీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి బ్యారెల్ ముడి చమురు ధర భారీగా తగ్గుతూనే వచ్చిందని, కానీ ఘనమైన మోదీ పాలనలో, దేశంలో పెట్రో రేట్లు మాత్రం పెరుగుతూ పోయాయన్నారు. రేట్లు పెంచిన ప్రతిసారి అంతర్జాతీయ ముడి చమురు ధరలను బూచీగా చూపడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. అంతర్జాతీయంగా బ్యారెల్ ముడిచమురు ధర తగ్గితే ఆ ప్రయోజనం ఎక్కడ దేశ ప్రజలకు ఇవ్వాల్సి వస్తుందేమోనన్న కుటిల అలోచనతో మోదీ ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను, సెస్సులను భారీగా పెంచుతున్నదని తెలిపారు. 2014 నుంచి ఇప్పటిదాకా పెంచడమే తప్ప తగ్గించడం తెలియదన్నట్టుగా పెట్రో ధరలను మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పదులసార్లు పెంచిందని కేటీఆర్ తెలిపారు. కార్పోరేట్లకు పాదసేవ చేస్తూ, జాతి సంపదను అప్పనంగా వారికి కట్టబెడుతూ, దేశంలోని ఒక్కో వ్యవస్థను కబళిస్తూ మోదీ సర్కార్ జనాలను పీక్కుతింటున్నదన్నారు. ఇప్పటివరకు పెట్రో పన్నులు, సెస్సుల రూపంలో రూ. 26 లక్షల కోట్లకు పైగా జనం జేబుల నుంచి దౌర్జన్యంగా దోచుకున్న మోదీ ప్రభుత్వం, మరోవైపు బ్యాంకుల నుంచి కార్పోరేట్ బడాబాబులు తీసుకున్న రుణాలను మాఫీ చేయడానికి ఆ మొత్తాన్ని ఉపయోగిస్తున్నదన్నారు. మోదీ ప్రేమ కార్పోరేట్ కంపెనీలపైననే కానీ, కాయ కష్టం చేసుకునే దిగువ, మధ్యతరగతి వారిపై కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. పెట్రో రేట్ల పెరుగుదల అనాటి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అని అధికారంలోకి రాకముందు గొంతు చించుకున్న నరేంద్రమోదీ, ఇప్పుడు ధరల పెరుగుదలను ఆపడంలో తాను ఘోరంగా విఫలం అయ్యారని ఒప్పుకుంటారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. 2014లో మోదీ సర్కారు ఏర్పాటైనప్పుడు బ్యారెల్ ముడిచమురు ధర దాదాపు 110 డాలర్లుగా ఉండేదని, 2015 జనవరి నాటికి అది 50 డాలర్లకు, 2016 జనవరిలో అయితే 27 డాలర్లకు పడిపోయిందన్నారు. ఇక 2020లో కరోనా లాక్‌డౌన్ అప్పుడు బ్యారెల్ ముడిచమురు ధర ఏకంగా 11 డాలర్లకు సైతం పడిపోయిందన్నారు. కానీ దేశంలో మాత్రం మోదీ ప్రభుత్వం ఏనాడు పెట్రో ధరలను ఆ మేరకు తగ్గించిన పాపాన పోలేదన్నారు. కేంద్ర సంస్థల గణాంకాల ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి మూడేళ్లు 2014 మే నుంచి 2017 సెప్టెంబరు మధ్యనే పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీ 54 శాతం పెరిగితే, డీజిల్ మీద ఏకంగా 154 శాతం పెరిగిందని కేటీఆర్ తెలిపారు. పెట్రో ధరలను పెంచి ప్రజల నుంచి భారీగా ఆదాయాన్ని గుంజిన మోదీ సర్కార్, దాన్ని మరింత పెంచుకునేందుకు బరితెగించిందన్నారు కేటీఆర్. 2020 వరకు పెట్రోల్, డీజిల్ పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని గరిష్టంగా పెంచుకోవడానికి వీలుగా 2020 మార్చిలో చట్ట సవరణ సైతం చేసిందన్నారు. ప్రజలపై భారం వేసేందుకు చట్టాన్ని సైతం సవరించిన ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీదని కేటీఆర్ మండిపడ్డారు. కోవిడ్ మహమ్మారితో ఓ వైపు దేశ ప్రజలు ఆర్థికంగా చితికిపోయి ఉన్న సమయంలో కనీస కనికరం లేకుండా మోదీ సర్కార్ ఎక్సైజ్ సుంకాన్ని పెంచుకుంటూ పోయిందన్నారు. ఒక అంచనా ప్రకారం 2020 నాటికే మోదీ సర్కారు ఒక్క ఎక్సైజ్ డ్యూటీ రూపంలోనే సుమారు రూ. 14 లక్షల కోట్లను ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిందన్నారు. సెస్సులు, పన్నుల రూపంలో ఇప్పటిదాకా మెత్తం రూ. 26 లక్షల కోట్లను ప్రజల నుంచి గుంజిన దగాకోరు ప్రభుత్వం మోదీదని కేటీఆర్ మండిపడ్డారు. ఇక కేంద్రం పెంచిన ఎక్సైజ్ డ్యూటీ నుంచి రాష్ట్రాలకు వచ్చేదే చాలా తక్కువన్న కేటీఆర్, రాష్ట్రాలు ఆర్థికంగా బలహీన పడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న మోదీ సర్కార్, పన్నుల రూపంలో కాకుండా సెస్సుల రూపంలోనే ఎక్కువగా పెట్రో రేట్లను పెంచిందని కేటీఆర్ తెలిపారు. సెస్సుల రూపంలో ప్రజల నుంచి భారీగా వసూలు చేస్తూ తన ఖజానా నింపుకుంటుందని కేటీఆర్ అరోపించారు. కేంద్ర సెస్సులు కాకుండా విధించిన ఒక్క పెట్రో సుంకాలను పూర్తిగా ఎత్తేస్తే ప్రతి లీటర్ పైనా ప్రజలకు దాదాపుగా రూ. 30 వరకు ఉపశమనం లభిస్తుందని కేటీఆర్ అన్నారు. పెట్రో రేట్లు పెరిగితే అటోమెటిక్ గా రవాణా ఖర్చులు కూడా పెరుగుతున్నాయని, అడ్డూ అదుపు లేకుండా మోదీ సర్కార్ పెంచిన పెట్రో రేట్లతో నిత్యావసరాల ధరలు పెరిగి దేశ చరిత్రలోనే అత్యధికంగా ద్రవ్యోల్బణం నమోదవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు. పేదోడు దేన్నీ కొనలేకపోతున్నాడని, మధ్యతరగతి బ్జడెట్ తలకిందులైందని, పేద, మధ్యతరగతి వర్గాల పరిస్దితులు పూర్తిగా దిగజారిపోయాని కేటీఆర్ అవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ తెలిసి కూడా ప్రజల పట్ల కనికరంలేని ప్రధాని మోదీ పెట్రో ధరలు తగ్గించడం లేదన్నారు. పైగా సెస్సులు, సుంకాల పేరుతో దోపిడీ చేస్తూనే, అ నెపాన్ని రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటిదాకా పెట్రోల్ పైన ఒక్క రూపాయి అదనపు పన్ను వేయని తెలంగాణ లాంటి రాష్ట్ర ప్రభుత్వాలపైకి నెడుతూ, పేదల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నదని, ఇది నయవంచనకు పరాకాష్ట అన్నారు. ప్రస్తుతం ముడి చమురు బ్యారల్ ధర 95 డాలర్లకు తగ్గినా, పెట్రో రేట్లను తగ్గించడం లేదనని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం దేశ ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భరమైన ద్రవ్యోల్బణ పరిస్థితులు, కరోనా, లాక్ డౌన్, కేంద్ర ప్రభుత్వ విఫల విధానాల ఫలితంగా ఉపాధులు కోల్పోయిన ఉన్న నేపథ్యంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పైన ఉన్న అన్ని రకాల సెస్సులను రద్దు చేసి పెట్రో ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

# బండి సంజయ్ పాదయాత్రపై హైకోర్టులో విచారణ

### విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు






**కరీంనగర్, ఆగస్ట్ 24 (సమసమాజం):** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టిన బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర కొనసాగింపుపై విచారణను హైకోర్టు నేటికి వాయిదా వేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టిన బండి సంజయ్ ప్రజా సంగ్రామ యాత్ర కొనసాగింపుపై విచారణ జరిగింది. బీజేపీ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటీషన్ విచారణలో భాగంగా ప్రభుత్వం వాదనలు వినిపించింది. శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే పోలీసులు యాత్రకు నిరాకరించారని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. యాత్రలో బండి సంజయ్ విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని చెప్పారు. ఆయన కామెంట్ల వల్ల మరోసారి శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందనే పాదయాత్రకు అనుమతి నిరాకరించినట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ వాదనపై స్పందించిన న్యాయస్థానం 22 రోజుల పాటు పాదయాత్ర కొనసాగిన తర్వాత ఇప్పుడు అనుమతి చెప్పడమేంటని ప్రశ్నించింది. ఏ కారణాల వల్ల యాత్ర నిలిపేశారో ఆధారాలను రేపటిలోగా సమర్పించాలని ఆదేశించింది. తమ దగ్గర ఉన్న వీడియోలను రేపు.10.30 గంటలకు కోర్టు ముందుంచుతామని తరుపు న్యాయవాది న్యాయమూర్తికి చెప్పారు. దీంతో న్యాయస్థానం కేసు తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ పాదయాత్రను నిలిపివేయాలంటూ పోలీసులు ఇచ్చిన నోటీసులపై బీజేపీ హైకోర్టును ఆశ్రయించింది. తాము చేపట్టిన పాదయాత్రకు వరంగల్ పోలీసులు అనుమతి నిరాకరిస్తున్నారని అందులో పేర్కొంటూ బీజేపీ నేతలు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. యాత్రను మధ్యలో నిలిపి వేయాలంటూ నోటీసులు ఇవ్వడం సరైన పద్ధతి కాదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. పాదయాత్రకు అనుమతిలిచ్చేలా ఆదేశించాలని న్యాయమూర్తిని కోరారు. పిటీషన్ ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణ రేపటికి వాయిదా వేసింది. బండి సంజయ్ ప్రస్తుతం జనగామ జిల్లాలో ప్రజా సంగ్రామ యాత్ర చేస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కవిత ఇంటిని ముట్టడించిన ఘటనలో బీజేపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఆయన దీక్షకు దిగారు. దీక్షను భగ్నం చేసిన పోలీసులు బండి సంజయ్ ను వెంటనే పాదయాత్రను నిలిపివేయాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో బండి పాదయాత్ర చేపడితే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశముందని చెప్పారు. పర్మిషన్ లేకుండా యాత్ర చేపడితే జరగబోయే పరిణామాలకు బాధ్యత వహించాలని పోలీసులు హెచ్చరించారు.

# పాతబస్తీలో కొనసాగుతున్న ఉద్రిక్తత

### రంగంలోకి దిగిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్

### మరో 20మంది ఆందోళనకారుల అరెస్ట్


**హైదరాబాద్, ఆగస్ట్ 24 (సమసమాజం):** ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో పాత బస్తీలో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. రాజాసింగ్‌ను అరెస్ట్ చేయాలంటూ ఓ వర్గం పలు ప్రాంతాల్లో గత రాత్రి నుంచి ఆందోళనకు దిగింది. చార్మినార్, మదీన, చాంద్రయాణగుట్ట, బార్కాస్, సిటీ కాలేజ్ తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో రోడ్లపై చేరి రాజాసింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం కొంతమంది ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు తాజాగా మరో 20 మందిని షాలిబండ వద్ద అరెస్టు చేశారు. భారీగా మోహరించిన పోలీసులు.. ఈ నేపథ్యంలో పాతబస్తీలోని పలుప్రాంతాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులను మోహరించారు. నేర విభాగ అదనపు సీపీ ఏఆర్ శ్రీనివాస్ పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ రోజు ఉదయం పత్తర్ ఘట్టి కార్పొరేటర్ సోహెల్ ఖాద్రి ఆధ్వర్యంలో షాలిబండలో ర్యాలీకి బయల్దేరగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆందోళన చేస్తున్న 31మందిని ఆరెస్ట్ చేసి కంచన్ భాగ్ పీఎస్‌కి తరలించారు. ఇదే సమయంలో మధ్యాహ్నం మొఘల్ పురాతో పాటు మీర్ చౌక్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడంతో వాటిని నమ్మొద్దని పోలీసులు తెలిపారు. ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సాయంత్రం ర్యాలీగా వచ్చిన 20 మంది ఆందోళనకారులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు.పాతబస్తీలో ఆంక్షలు.. ఉదయం షాలిబండ ఆందోళన నేపథ్యంలో ముందస్తుగా పోలీసులు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్?ను రంగంలోకి దింపారు. మీర్ చౌక్, చార్మినార్, గోషామహల్ జోన్ల పరిధుల్లో మొత్తం 360 మంది ఆర్ఏఎఫ్ బలగాలు విధుల్లో ఉన్నాయి. లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి చార్మినార్ నుంచి లాగ్ మార్చ్



నిర్వహిస్తున్న సమయంలోనే మీర్ చౌక్ వద్ద ఈ ర్యాలీలో ఉన్న 20 మందిని అరెస్ట్ చేశారు. మరో వైపు తాజా పరిణామాల నేపథ్యంలో పాతబస్తీ సహా దక్షిణ మండలంలో మద్యం, పాన్ షాపులు, దుకాణాలు, హోటళ్లు రాత్రి 8గంటలకే మూసి వేయాలని పోలీసులు ఆదేశించారు. రాత్రి కూడా పోలీసు అదనపు బలగాలు పాత బస్తీ పరిసర ప్రాంతాల్లో పహారా కాయనున్నాయి.




# చలన చిత్రం




# లైగర్‌పై భారీ అంచనాలు

### నేడు థియేటర్లలో విడుదల కానున్న చిత్రం

### విజయ్ దేవరకొండ యాక్షన్ సీన్‌పై సర్వత్రా ఆసక్తి

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, డైనమిక్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ తొలి కలయికలో తెరకెక్కిన యాక్షన్ స్పోర్ట్స్ డ్రామా 'లైగర్' .. 'సాలా క్రాస్‌బ్రీడ్' ట్యాగ్ లైన్. పూరీ కనెక్ట్స్, ధర్మ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ పాన్ ఇండియా చిత్రం 25న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల కానుంది. విజయ్ బాక్సర్ గా నటిస్తుండడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే కథానాయికగా నటిస్తుండగా, రమ్యకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచ బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ మరో ముఖ్యపాత్రను చేస్తున్నారు. 'లైగర్' చిత్రం ప్రమోషన్స్‌ను కోసం పూరీ అండ్ టీమ్ ఓ రేంజ్‌లో కష్టపడ్డారు. విజయ్ దేవరకొండ అయితే నార్త్‌లో వరుస ఇంటర్వ్యూలు నిర్వహించి సినిమాపై అంచనాల్ని పెంచేశాడు. 'లైగర్' సక్సెస్‌పై విజయ్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడు. దానికి తగ్గట్టుగానే.. విజయ్ దేవరకొండ వన్‌మేన్ షో చేశాడని అంటున్నారు. అన్నిరకాలుగానూ తన అభినయంతో మనసు దోచుకున్నాడు. కళ్ళు చెదిరే యాక్షన్ స్టంట్స్, అదిరిపోయే డైరెక్షన్.. రమ్యకృష్ణ సర్‌ప్రైజ్ ప్యాకేజ్. అయితే కథ, స్క్రీన్ ప్లే యావరేజ్‌గా ఉన్నాయని అంటున్నారు. దాంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. తల్లీ కొడుకుల సెంటిమెంట్ నేపథ్యంలోని ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉంటుందని వార్తలొచ్చాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలు పెంచేసేంది. పాన్ ఇండియా స్థాయికి తగినట్లే ప్రచారం కూడా చేయడంతో 'లైగర్'గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుకుంటున్నారు. ఈ చిత్రంపై పలువురు సినీ ప్రముఖులు స్పందిస్తున్నారు. లైగర్ పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. తాజాగా స్టార్ హిరోయిన్ అనుష్క శెట్టి సోషల్ మీడియా వేదికగా 'లైగర్'టీమ్‌కి ఆల్ ది బెస్ట్ చెప్పింది. విజయ్ కూడా అనుష్క పోస్ట్‌పై స్పందించాడు.' థ్యాంక్యూ సోమచ్ స్వీటీ.. అర్జున్ రెడ్డి సినిమా విడుదలప్పుడు కూడా మీకు ఇలాగే విషెస్ చెప్పారు. ఆ సినిమాలాగే లైగర్ కూడా సూపర్ హిట్ అవుతుందని ఆశిస్తున్నాను' అని విజయ్ రిప్లై ఇచ్చాడు. అయితే అనుష్క తన పోస్ట్‌లో పూరి జగన్నాథ్ 'జగ్గుదాదా' అని సంబోధించడం విశేషం. కాగా పూరి జగన్నాథ్ తెరకెక్కించిన సూపర్ చిత్రంతోనే అనుష్క వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే.



# సౌందర్యతో నాది స్నేహబంధం: జగపతిబాబు

లెజెండరి నటుడు జగపతి బాబు ఒకప్పుడు ఫ్యామిలీ హీరోగా పేరు తెచ్చుకున్న ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌లో స్టార్ హీరోలకు విలన్‌గా నటిస్తూ వరుస ఆఫర్లు అందుకుంటున్నాడు. 'మావిడాకులు, శుభలగ్నం, సర్దుకుపోదాం రండి, ఫ్యామిలీ సర్కస్' కుటుంబ కథా చిత్రాలతో జగపతి బాబు ఎంతో గుర్తింపు పొందారు. అయితే అప్పట్లో జగపతి బాబు, దివంగత నటి సౌందర్యలది హిట్ పెయిర్ అనే విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాలన్ని మంచి విజయం సాధించాయి. దాదాపు తెరపై భార్యభర్తలుగా నటించిన వీరిద్దరిపై అప్పట్లో రూమర్స్ కూడా బాగానే వచ్చేవి. అయితే సౌందర్య పెళ్లి అనంతరం వాటికి చెక్ పడింది. కానీ పెళ్లికి ముందు మాత్రం వీరిద్దరి పెయిర్, ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ చూసి సౌందర్య, జగపతి బాబు మధ్య ఏదో స్పెషల్ బాండింగ్ ఉందంటూ అప్పట్లో అందరూ చెవులు కొరుక్కునేవారు. అంతేకాదు తరచూ సౌందర్య ఇంటికి జగపతి బాబు, ఆయన తన ఇంటికి వెళ్లడం చూసి వారిద్దరి రిలేషన్ గురించి పుకార్లు షికారు చేస్తుండేవనే విషయం తెలిసిందే. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతి బాబుకు దీనిపై ప్రశ్న ఎదురైంది. ఆయన స్పందిస్తూ.. తనకు, సౌందర్యకు మధ్య రిలేషన్ ఉన్నమాట నిజమే అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కానీ అది మీరు అనుకున్నది కాదు. మేమిద్దరం మంచి స్నేహితులం. ఆమె అన్నయ్య కూడా నాకు మంచి ఫ్రెండ్. సౌందర్య వ్యక్తిగతంగా చాలా మంచి అమ్మాయి. మేము మాత్రమే కాదు మా ఫ్యామిలీలు కూడా చాలా క్లోజ్. ఎవరింట్లో ఏ ఫంక్షన్ అయినా కుటుంబ సమేతంగా హాజరయ్యేవాళ్లం. ఈ క్రమంలో సౌందర్య తరచూ మా ఇంటికి వస్తుండేవారు. నేను వాళ్ల ఇంటికి వెళ్తుండేవాడిని. అది చూసి జనాలు తప్పుగా అర్థం చేసుకున్నారు. సౌందర్య అలాంటిది కాదని వివరణ ఇచ్చారు.



# పూరిని ఇంటర్వ్యూ చేసిని సుకుమార్

### అప్పట్లో మీ వద్ద అసిస్టెంట్‌గా చేద్దామనుకున్నా

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో వస్తోన్న 'లైగర్' బాక్సింగ్ వేపథ్యంలో నడిచే ఈ సినిమాకి పూరితో పాటు చార్మీ .. కరణ్ జొహార్ నిర్మాణ భాగస్వాములుగా ఉన్నారు. బాక్సర్ గా విజయ్ దేవరకొండ నటించిన ఈ సినిమాలో ఆయన తల్లి పాత్రలో రమ్యకృష్ణ .. లవర్ పాత్రలో అనన్య పాండే కనిపించనున్నారు. మైక్ టైసన్ అతిథి పాత్రలో మెరవనున్నారు. ప్రపంచవ్యాప్తంగా 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ మరింత ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమాను గురించి పూరిని సుకుమార్ ఇంటర్వ్యూ చేయడం విశేషం.ముందుగా సుకుమార్ .. పూరితో ట్లాడుతూ 'సార్ .. మీకు గుర్తుందో లేదో .. 'బద్రి' సినిమా తరువాత నేను మీ దగ్గరకి వచ్చాను. అప్పట్లో ఆ సినిమా సూపర్ .. డూపర్ హిట్. సినిమాల్లోకి రావాలనుకుంటున్న నాకు ఆ సినిమా భలేగా నచ్చేసింది.దదాంతో మా దగ్గర బంధువుల్లో ఒకాయనకి మీరు బాగా తెలుసంటే అసిస్టెంట్ డైరెక్టర్ గా చేరాలనే ఆసక్తితో ఆయన వెంట మీ దగ్గరికి వచ్చాను. అమీర్‌పేట్ లోని ఒక కాఫీ హోటల్లో మిమ్మల్ని కలిశాను. 'కథ ఏదైనా రాసుకొచ్చావా?' అంటూ నాతో మీరు మాట్లాడారు. ఇక మీ సినిమాల్లో నాకు 'ఇడియట్' అంటే చాలా ఇష్టం. అప్పటివరకూ వచ్చిన లవ్ స్టోరీస్ కి భిన్నంగా ఆ సినిమా చేశారు. ఆ సినిమాలోని చాలా సీన్స్ చాలా కొత్తగా అనిపిస్తాయి. ఆ తరహా సీన్స్ ఆ సినిమాతోనే మొదలయ్యాయి. ఎంటర్‌టైన్ మెంట్ విషయంలో ఎక్కడ ఏ మాత్రం గ్యాప్ లేకుండా భలే కొత్తగా తీశారే అనుకున్నాను. ఎప్పటికైనా పూరీలా ఒక సినిమా చేయాలని ఆ సినిమా చూసిన తరువాతనే నేను అనుకున్నాను. సుకుమార్ నవ్వేశాడు. ఖర్చు పరంగా నిర్మాతలను .. సమయం పరంగా ఆర్టిస్టులను ఇబ్బంది పెట్టను' అంటూ చెప్పుకొచ్చాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in